# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-03-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. భూమికి తిరిగి సురక్షితంగా చేరుకున్న సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లకు ప్రధానమంత్రితో సహా పలువురు అభినందనలు తెలిపారు.
2. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 'మన బడి- మన భవిష్యత్తు' కింద మౌలిక వసతులు కల్పించనున్నామని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు.
3. ఆహార పదార్థాల్ని కల్తీ చేసే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.
4. రాష్ట్రంలో ఎలకాట్రనిక్స్, ఇతర రంగాల్లో పెట్టుబడులను ప్రభుత్వం ఆహ్వానిస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.
5. ద్రవ్యోల్బణం తక్కువగా నమోదవుతున్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో ఉందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.

==========================

భూమికి తిరిగి సురక్షితంగా చేరుకున్న సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ, ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహా పలువురు అభినందనలు తెలిపారు. అలాగే వారికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ అభినందనలు తెలిపింది. వీరిద్దరూ భూమిపైకి సురక్షితంగా తిరిగి రావడం శుభపరిణామమని శాసనసభ పతి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. వ్యోమగాముల జీవితం మానవాళికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

--------------------------

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 'మన బడి- మన భవిష్యత్తు' కింద మౌలిక వసతులు కల్పించనున్నామని విద్యా శాఖమంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. శాసనసభ సమావేశాలలో భాగంగా పాఠశాలల్లో సదుపాయాలపై శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు.. ఆదర్శ పాఠశాలను ఏర్పాటు చేసి విద్యాప్రమాణాలు పెంచుతున్నామన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఒక ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయనున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 36 సెకన్లు

--------------------------

రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో శాసనసభ్యులకు క్రీడా పోటీలను రాష్ట్ర మంత్రులు, ఉపసభాపతి కే. రఘురామ కృష్ణం రాజుతో కలసి ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు ఆటవిడుపు కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం క్రీడలను ప్రారంభించిందన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు ఈ ఆటల పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు.

---------------------------

ఆహార పదార్థాల్ని కల్తీ చేసే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా ఈరోజు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ, కేంద్ర ప్రభుత్వం రూపొందించిన జాతీయ చట్టాల మేరకు రాష్ట్రంలో ఆహార కల్తీని నిరోధించటానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆహార వస్తువుల అమ్మకం, నిల్వ, పంపిణీ, పర్యవేక్షణకు సంబంధించి 2006 నాటి ఆహార భద్రత, ప్రమాణాల చట్ట నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలియజేస్తూ,

వాయిస్.. 36 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ఎలకా్ట్రనిక్స్, ఇతర రంగాల్లో పెట్టుబడులను ప్రభుత్వం ఆహ్వానిస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీ.జీ భరత్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో కొరియా ప్రతినిధి బృందంతో నిన్న మంత్రి చర్చలు జరిపారు. అనంతరం పలు రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు కొరియా బృందం రాష్ట్ర ప్రభుత్వంతో ముసాయిదా ఒప్పందంపై సంతకాలు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ, పారిశ్రామిక సముదాయాల అభివృద్ధి, ఆగ్రో, ఆహార శుద్ధి వంటి 25 పరిశ్రమల్లో కొరియన్ సంస్థలు పెట్టుబడులను పెట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రం నుంచి కొరియాకు మామిడి ఎగుమతులను పునరుద్ధరించడం, హస్తకళలు, ఆయుర్వేదం బ్రాండ్లను కొరియన్ మార్కెట్‌లో విస్తరించడం వంటి అంశాలపై చర్చించామని మంత్రి తెలిపారు.

---------------------------

ద్రవ్యోల్బణం తక్కువగా నమోదవుతున్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో ఉందని పౌర సరఫరాయల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మార్కెట్ ధరల పర్యవేక్షణపై నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘం నిన్న రాష్ట్ర సచివాలయంలో సమావేశమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2.44 శాతంతో వరుసగా 3 నెలలు జాతీయ సగటు కన్నా రాష్ట్ర ద్రవ్యోల్బణం తక్కువగా నమోదు అయ్యిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 154 మండల కేంద్రాలు, 151 రైతు బజార్‌లో నుంచి ప్రతిరోజు సిపి యాప్ తో ధరలను సేకరించి వాటిపై విశ్లేషణ చేస్తున్నట్లు వివరించారు.

---------------------------

మహిళలు, చిన్నారుల రక్షణకు పోలీసు బృందాల సేవలతో పాటు “శక్తి మొబైల్ యాప్” సేవలను వినియోగించుకోవచ్చని పశ్చిమగోదావరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అద్నాన్ నయీమ్ అస్మి చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఎస్పీ ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, మహిళల రక్షణకు జిల్లాలోని

మూడు సబ్ డివిజన్లకు మూడు శక్తి బృందాలు జిల్లా కేంద్రంలో మరొక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. మొబైల్ శక్తి యాప్ ద్వారా మహిళలు రక్షణతో పాటు గృహ హింస వంటి నేరాలకు సంబంధించి ఫిర్యాదులు చేయవచ్చని ఎస్పీ సూచించారు.

---------------------------

జాతీయ క్షయ నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నమని వైయస్సార్ కడప జిల్లా వైద్యాదికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. కడపలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో ఈరోజు బాధితులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడు నెలల వయసు నిండిన చిన్నారుల నుంచి 60 ఏళ్లు పై బడిన వారికి టీబీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామీణ చికిత్స కేంద్రాలలో ప్రతి బుధవారం,శనివారం ఈ పరీక్షలు నిర్వహిస్తామని ఆయన తెలుపుతూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

ప్రకాశం జిల్లాలో బాల్యవివాహాలను నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. జిల్లాలో బాల్య వివాహాల కట్టడికి ప్రజలను, స్వచ్ఛంద సంస్థలను ఇందులో భాగస్వాములను చేస్తూ రూపొందించిన 'బంగారు బాల్యం' కార్యక్రమానికి జాతీయస్థాయిలో పురస్కారం లభించిందని ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో జిల్లా కలెక్టం ఈ అవార్డును అందుకోనున్నారు. కాగా, జాతీయస్థాయిలో స్కోచ్ అవార్డు సాధించిన జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అభినందనలు తెలిపారు. 'బంగారు బాల్యం' కార్యక్రమంతో జిల్లాలో బాల్యవివాహాలు అరికట్టేందుకు కలెక్టర్ చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

---------------------------

భారతీయ సంస్కృతి, ప్రాచీన విద్యకు ప్రాధ్యాన్యం కల్పించడమే లక్ష్యంగా సంస్కృత విశ్వవిద్యాలయం పనిచేస్తోందని తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి జి.ఎస్.ఆర్.క్రిష్ణమూర్తి తెలిపారు. తిరుపతిలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం నాలుగవ స్నాతకోత్సవాన్ని రేపు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగే స్నాతకోత్సవంలో 564 మందికి వివిధ కోర్సుల్లో డిగ్రీ పట్టాలను అందజేస్తామని తెలిపారు.

---------------------------

కృష్ణాజిల్లా గన్నవరం సమీపంలోని మల్లవల్లి పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసిన అశోక్ లేలాండ్ తయారీ కేంద్రాన్ని ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ఈ రోజు సాయంత్రం ప్రారంభించనున్నారని అధికారులు తెలిపారు. ఈ ప్లాంట్ ఏర్పాటు ద్వారా మొదటి దశలో లో 600 మందికి, రెండవ దశలో 1200 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. 75ఎకరాల్లో విస్తరించిన ఈ ప్లాంటు అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలతో సంవత్సరానికి 2400 బస్సులను ఉత్పత్తి చేయనుందని తెలిపారు.

=====================